క్లుప్తంగా

మందలమ్మతల్లికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

ఆమదాలవలస రూరల్: సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం గ్రామంలో వెలిసిన మందలమ్మతల్లి అమ్మవారి పేరంటాళ్లకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతీ ఏడాది ఉగాది ముందు వచ్చే గురువారం అమ్మవారికి గ్రామస్తులంతా కలిసి ముర్రాటలు పోసి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తుంది. పూర్వీకుల నుంచి వస్తున్న ఆచార, సంప్రదాయాల ప్రకారం మందలమ్మతల్లికి కుంకుమ పూజలు నిర్వహించారు. గ్రామస్తులతోపాటు పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం



హోమం నిర్వహిస్తున్న రుత్వికులు

సారవకోట: మండలంలోని అర్లి గ్రామంలోని అభయాంజనేయ స్వామి ఆలయ 12వ వార్షికోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక, విశేష పూజలు, అభిషేకాలు, హోమాన్ని రుత్వికులు శ్రీనివాస చక్రవర్తి చేయించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన కార్యక్రమం చేపట్టారు.

ప్రజా సేవలోనే బొడ్డేపల్లి కుటుంబం



పార్టీ నాయకులతో సమావేశమైన బొడ్డేపల్లి రమేష్

ఎల్.ఎన్.పేట: ప్రజా సేవలో బొడ్డేపల్లి కుటుంబం ఎప్పుడూ ముందు ఉంటుందని, ప్రజాక్షేత్రంలోకి మరోసారి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఆమదావలస మున్సిపాల్టీ మాజీ చైర్మన్ బొడ్డేపల్లి రమేష్ అన్నారు. మండలంలోని గొట్టిపల్లి, బొత్తాడసింగి, తురకపేట, రావిచెంద్రి, కుశమలపాడు, కరకవలస, పూశాం, మిరియాపల్లి తదితర గ్రామాల్లో గురువారం పర్యటించారు. తన తాతగారైన బొడ్డేపల్లి రాజగోపాలరావు, అమ్మ బొడ్డేపల్లి సత్యవతితో కలిసి పనిచేసిన రాజకీయ కుటుంబాలకు చెందిన వారితో మమేకమయ్యారు. స్థానిక నాయకులు, గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

పెద్దసీదిలో ఫ్యామిలీ డాక్టర్



వైద్య సేవలు అందజేస్తున్న వైద్యుడు సదాశివ

పాతపట్నం: మండలంలోని పెద్దసీది గ్రామ సచివాలయంలో బైదలాపురం పీహెచ్‌సీ వైద్యుడు జి.సదాశివ ఆధ్వర్యంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు, బాలింతలు, మంచం పట్టిన రోగులకు, బీపీ, సుగర్ వంటి సమస్యలతో బాధపడుతున్నవారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంపీపీ పాఠశాలలోని విద్యార్థులు, అంగన్‌వాడీ చిన్నారులు, అవసరమైన వారికి మందులను అందజేశారు. హెచ్‌వీ జి.సోమేశ్వరావు, ఏఎన్‌ఎం జి.అన్నపూర్ణ, సచివాలయ ఉద్యోగులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

మెళియాపుట్టి: క్షయవ్యాధి పట్ల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండలంలోని ఇల్లాయిపురం కమ్యూనిటీ హెల్త్ అధికారి సంతోష్ కుమార్ అన్నారు. గురువారం ఇల్లాయిపురంలో క్షయ వ్యాధిపై అవగాహనలో భాగంగా వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ (టీబీ ముక్తభారత్ మేళా కార్యక్రమం) నిర్వహించారు. దగ్గు, ఆయాసం, నీరసం తదితర లక్షణాలున్న వారికి కెళ్ల ద్వారా పరీక్షలు నిర్వహించి నిర్ధారణ అయితే.. ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందన్నారు. క్షయ వ్యాధి సోకిన వారికి మానసిక ప్రశాంతత అవసరమన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో క్షయవ్యాధి ప్రాణాంతకం కాదని, తగిన జాగ్రత్తలు పాటిస్తే నయమవుతుందన్నారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

పాతపట్నం: మేజర్ పంచాయతీ పరిధిలోని శివశంకర్ కాలనీ మూడో లైన్‌కు చెందిన ఇప్పిలి వెంకటరమణ ఇటీవల మృతి చెందారు. మృతుడు భార్య విజయకు పంచాయతీ ఈఓ కూర్మారావు, సచివాలయ సిబ్బంది వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను గురువారం అందజేశారు. అలాగే కోర్టు వీధికి చెందిన గూనపు శ్రీనివాసరావు ఇటీవల మృతి చెందారు. ఆయన భార్య గూనపు సంతోషకుమారికి ఈఓ కూర్మారావు వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను అందజేశారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జనరంజక బడ్జెట్

రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి గురువారం అసెంబ్లీలో 2023–2024 సంవత్సరానికి ప్రవేశ పెట్టిన బడ్జెట్‌పై అన్ని వర్గాలవారు హర్షం వ్యక్తం చేశారు. ఇది ప్రజారంజక బడ్జెట్ అని, వ్యవసాయం, వైద్యం, విద్యా తదితర రంగాలకు మేలు చేసేలా ఉందన్నారు. – సాక్షి నెట్‌వర్క్

అన్ని వర్గాలకూ మేలు..



ఈ బడ్జెట్ పేదలను లక్షాధికారులను చేసేలా ఉంది. ఒక వైపు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ.. మరోవైపు అన్ని వర్గాలను ఆదుకునేలా ఉంది. రైతులకు, విద్యకు, వైద్యానికి పెద్దపీట వేసింది.

– ధర్మాన కృష్ణచైతన్య, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జి, పోలాకి జెడ్పీటీసీ

మహిళా సాధికారితకు పెద్దపీట



ఈ బడ్జెట్ మహిళలను మహారాణులగా చేసేదిగా ఉంది. ప్రాధాన్యతా రంగాలకు బడ్జెట్లో నిధులు కేటాయిస్తూ మరోవైపు మహిళా సాధికారితను దృష్టిలో పెట్టుకుని డ్వాక్రా సంఘాలకు వడ్డీలేని రుణాలు, అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ కల్యాణమస్తు పథకాలకు నిధులు కేటాయించారు.

– రాజాపు హైమావతి, రాష్ట్ర పొందర, కూరాకుల కార్పొరేషన్ చైర్ పర్సన్

రైతులకు ప్రాధాన్యత



రైతులు, రైతు కూలీల కష్టాలను తన పాదయాత్రలో తెలుసుకుని వారి శ్రేయస్సు కోరి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ ఏడాది కూడా రైతులకు మేలు చేసేలా బడ్జెట్ రూపకల్పన చేశారు. వ్యవసాయ యాంత్రీకరణకు, ధరల స్థిరీకరణ నిధి, వైఎస్సార్ రైతు భరోసా, రైతులకు వడ్డీ లేని రుణాలు వంటి పథకాలకు అధిక నిధులు కేటాయించారు. ప్రాజెక్టులు, నీటి పారుదలరంగానికీ నిధుల కేటాయింపు బాగుంది.

– బార్ల వేణుగోపాలరావు, రైతు సంఘం నాయకులు, చెన్నాపురం

ప్రజాసంక్షేమ బడ్జెట్



పేదలకు అండగా నిలిచే సంక్షేమ పథకాలకే అధిక ప్రాధాన్యత ఇస్తూ బడ్జెట్ ప్రవేశపెట్టడం ఆనందాయకం. వైద్య రంగానికి అధిక నిధులు కేటాయించడం వల్ల నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడానికి వీలు కలుగుతుంది. ప్రజల సంక్షేమం కోసం బడ్జెట్‌ను కేటాయించడం స్వాగతిస్తున్నాం.

– తమ్మినేని శ్రీరామ్మూర్తి, మండల ప్రత్యేకాహ్వానితుడు, ఆమదాలవలస మండలం

విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం



విద్య, వైద్య రంగాలకు నిధులు కేటాయింపుల్లో ప్రాధాన్యత ఇవ్వడం ఎంతో హర్షించ దగ్గ విషయం. పేదలకు కార్పొరేట్ వైద్యం, విద్య అందుతుంది. ఈ ప్రభుత్వం అధికంగా నిధులు కేటాయించడం ప్రజలకు ఎంతో ఉపయోగం. – వలురౌతు ప్రసాదరావు, బీజేపీ మండల కన్వీనర్, కొత్తూరు

పారిశ్రామికాభివృద్ధికి సహకారం



వైద్య, విద్య, వ్యవసాయ రంగాలకు పెద్దపీట వేయడం అభినందనీయం. పారిశ్రామికాభివృద్ధికి సహకరించి, సమాజంలో అసమానతలు, తగ్గించి, పేదరికాన్ని రూపుమాపేలా బడ్జెట్ ఉంది.

– కర్నెన దీప, ఎంపీపీ, బూర్జ

అమరజీవి ప్రాణత్యాగం మరువలేనిది



హిరమండలం: పొట్టిశ్రీరాముల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఆమదాలవలస: మున్సిపల్ కార్యాలయంలో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమిషనర్ కె.అప్పలనాయుడు, తదితరులు

ఆంధ్ర రాష్ట్ర పితామహుడు, అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. భాషా ప్రాతిపదికన ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు అమరణ నిరాహార దీక్షచేసి ప్రాణత్యాగం చేశారన్నారు. ఆయన కృషి ఫలితంగానే 1953 అక్టోబర్ 1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు జరిగిందన్నారు. ప్రతిఒక్కరూ ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

–సాక్షి నెట్‌వర్క్



ఆమదాలవలస: వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం ఆవరణలో అమరజీవి విగ్రహాని నివాళుర్పిస్తున్న ఆర్య వైశ్య సంఘం సభ్యులు



పొందూరు: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో అమరజీవి జయంతిని నిర్వహిస్తున్న లైబ్రేరియన్ భాస్కరరాజా, విద్యార్థులు

నర్తు విజయంతో నూతనోత్సాహం



పాతపట్నం: కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎల్.ఎన్.పేట: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరపున నర్తు రామారావు పోటీ చేసి విజయం సాధించటంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఉత్సాహం రెట్టింపు అయింది. గురువారం ఫలితాలు వెలువడ్డిన వెంటనే ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపినవారిలో ఎల్.ఎన్.పేట ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, జెడ్పీటీసీ కిలారి త్రినాథులు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు తదితరులున్నారు.

పాతపట్నం: ఎమ్మెల్సీగా నర్తు రామారావు విజయంపై వైఎస్సార్‌సీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మండల నాయకులు గురువారం రాత్రి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. వైస్ ఎంపీపీ ఎస్ ప్రదీప్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన నర్తుకు శుభాకాంక్షలు తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్‌సీపీకి తిరుగులేని ఆదరణ ఉందని మరోసారి నిరూపితమైందన్నారు. పార్టీ నాయకులు వై.సూర్యం, నూలు ఈశ్వరరావు, ప్రహల్లధ్ పుల్లాయ్, చీకటి రాజు, గోపి, పురోషొత్తం, జక్కర ఉమ, నేతాజీ, కృష్ణారావు, శ్రీధర్, ధనుంజేయ, శేఖర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కొత్తూరు: ఎమ్మెల్సీగా నర్తు రామారావు విజయంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నెలకొందని వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు అన్నారు. తన కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి విజయోత్సవ సభ నిర్వహించారు. నర్తు విజయంపై హర్షం వ్యక్తం చేశారు. నర్తు గెలిపించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి గిఫ్టుగా ఇచ్చినట్లు అయిందన్నారు. మండల ప్రత్యేక ఆహ్వానితులు ఎ.ప్రశాంత్, కొత్తూరు, కర్లెమ్మ మాజీ సర్పంచ్‌లు ఎల్.తాతబాబు, పడాల వెంకటకృష్ణ, పార్టీ నాయకులు ఎస్.రమేష్, టి.పోలినాయుడు, బి.అప్పారావునాయుడు పాల్గొన్నారు. అలాగే నర్తు విజయం పట్ల వైఎస్సార్ సీపీ మండలం కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, జెడ్పీటీసీ కామక భాగ్యవతి, పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, కొత్తూరు సర్పంచ్ పడాల కృష్ణవేణి, పార్టీ నాయకులు బూర్లె శ్రీనివాసరావు, మెజ్జాడ చక్రపాణి, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హర్షం వ్యక్తం చేశారు.



ఎల్.ఎన్.పేట: నర్తుకు అభినందిస్తున్న ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు

హిరమండలం: ఎమ్మెల్సీగా నర్తు రామారావు భారీ మెజార్టీతో విజయం సాధించడంతో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మీసాల వెంకట రామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. నర్తు విజయానికి కృషిచేసిన పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులకు అభినందనలు తెలిపారు. పార్టీ నాయకులు మీసాల రామారావు, వి.బాలరాజు, యందవ ప్రసాద్, డి.సుందరమ్మ, ప్రసాద్ పండా, నక్క ఆనందరావు, సురేష్, శ్రీనివాసరావు, టి.తవుడు తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు: మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు



హిరమండలం: హర్షం వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సర్వాంగ సుందరంగా జగనన్న కాలనీలు



ఆర్చీ ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలిస్తున్న ఈఈ మోహన్‌రావు, ఎంపీపీ గోపి

జలుమూరు: సర్వాంగ సుందరంగా జగనన్న కాలనీలు ఏర్పాటుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామని గృహ నిర్మాణ శాఖ ఈఈ పీజేవీ మోహన్‌రావు అన్నారు. జలుమూరు మండల పరిధిలోని చల్లవానిపేట జగనన్న లే అవుట్‌ను ఎంపీపీ వాన గోపితో కలిసి గురువారం పరిశీలించారు. శ్రీకాకుళం డివిజన్ పరిధిలోని పది మండలాలైన శ్రీకాకుళం, గార, ఆమదాలువలస, రణస్థలం, లావేరు, ఎచ్చెర్ల, నరసన్నపేట, పోలాకి, జలుమూరులో 27 ఆర్చీలు ఏర్పాటుకు రూ.1.12 కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నామన్నారు. ఇందులో కొన్ని 15 అడుగులు ఎత్తు, 20 అడుగులు వెడల్పు కాగా.. మరికొన్ని 20 అడుగులు ఎత్తు, 20 అడుగులు వెడల్పు కూడా ఉన్నాయన్నారు. త్వరితగతిన పనులు ప్రారంభించి ఆర్చీలు ఏర్పాటు చేయనున్నామన్నారు. దీనికోసం అవసరమైన నిధులు సిద్ధంగా ఉన్నాయన్నారు. చల్లవానిపేట పీఏసీఎస్ అధ్యక్షుడు పాగోటి రాజప్పలనాయుడు, మండల సలహాదారుడు పైడి విఠల్‌రావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బుక్కా లక్ష్మణరావు, దామ మన్మధరావు, కోన దాము, వి.విజయ్, నరసన్నపేట, పోలాకి, జలుమూరు ఏఈలు ఎస్.శంకరరావు, జి.గురునాథరావు, డి.గోపీకృష్ణ పాల్గొన్నారు.

20న మహాశింగిలో డివిజన్ స్థాయి స్పందన

సారవకోట: మండలంలోని మహాశింగి గ్రామంలో ఈ నెల 20న టెక్కలి డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ప్రవల్లికాప్రియ తెలిపారు. టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి హాజరవుతారన్నారు. మండల స్థాయి అధికారులతోపాటు డివిజన్ స్థాయి అధికారులు హాజరుకానున్నారని తెలిపారు.

వెండి తరలిస్తున్న ముగ్గురు అరెస్టు.. విడుదల

ఆమదాలవలస: శ్రీకాకుళంరోడ్ (ఆమదాలవలస)రైల్వేస్టేషన్‌లో అక్రమంగా వెండి కడ్డీలను తరస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఆర్‌పీఎస్ అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13న హౌరా ఎక్స్‌ప్రెస్ నుంచి ప్లాట్‌ఫారం నంబర్ 3లో నాలుగు బ్యాగులతో దిగిన వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో శ్రీకాకుళం రోడ్ ఆర్పీఎఫ్ అధికారులు పట్టుకుని విచారించారని తెలిపారు. దీంతో ఆ వ్యక్తి దగ్గర ఉన్న బ్యాగ్‌లలో రూ. 31.8 లక్షలు విలువ చేసే వెండి కడ్డీలు, ఆభరణాలు ఉన్నట్లు గుర్తించారని, దీంతో అతనితోపాటు సహాయంగా ఉన్న మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారని పేర్కొన్నారు. జీఎస్టీ చెల్లించకుండా వెండి తరలిస్తున్నట్లు గుర్తించి, సంబంధిత యజమానితో మాట్లాడారని, ఆ మేరకు యజమాని రూ. 5,71,956 జీఎస్టీ మొత్తం చెల్లించారని వివరించారు. దీంతో అదుపులోకి తీసుకున్న ముగ్గురిని విడుదల చేసినట్లు తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన

సారవకోట: ఉపాధి హామీ వేతనదారులు రెండు పూటలా పని చేయాలని ఎంపీడీఓ విశ్వేశ్వరరావు అన్నారు. మండలంలోని మహాశింగి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం పరిశీలించారు. వేతనదారులు అధికారులు ఇచ్చిన కొలతలు ప్రాప్తికి పనులు చేయాలని, అప్పుడే ప్రభుత్వం నిర్ధారించిన వేతనం వస్తుందన్నారు. అనంతరం ధర్మలక్ష్మీపురం సచివాలయాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు.

చురుగ్గా ఏబీ రోడ్డు పనులు



ఎల్.ఎన్.పేట: ఏబీ రోడ్డులో చేపడుతున్న మరమ్మతు పనులు



పాతపట్నం: కృష్ణానగర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని ప్రధాన రహదారి అలికాం–బత్తిలి (ఏబీ) రోడ్డు మరమ్మతు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. బొర్రంపేట నుంచి సరుబుజ్జిలి వైపు ఉన్న గోతులు కప్పే పనులు ఇప్పటికే పూర్తిచేయటం జరిగింది. బొర్రంపేట నుంచి హిరమండలం వైపు ఉన్న ఏబీ రోడ్డులో స్కాట్‌పేట వరకు గోతులు పూడ్చే పనులు గత నాలుగు రోజులుగా జరుగుతున్నాయి. ప్రయాణికులు, స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సీసీ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభం

పాతపట్నం: మండల పరిధిలోని కృష్ణానగర్‌లో సీసీ రోడ్డు పనులను ఏఎంసీ చైర్మన్ కె.అర్జునుడు, వైస్ ఎంపీపీ ఎస్ ప్రదీప్‌లు గురువారం ప్రారంభించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3 లక్షలతో 60 మీటర్ల మేర సీసీ రోడ్డు వేస్తున్నామని ఏఎంసీ చైర్మన్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఎనుగుతల సూర్యం, గోకవలస రాము, మజ్జి వరదరాజులు, పెద్దింటి తిరుపతిరావు ఉన్నారు.

నేటినుంచి జిల్లా స్థాయి షటిల్ టోర్నీ



కోర్టు సిద్ధం చేస్తున్న మిత్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు

నరసన్నపేట: స్థానిక జీసీ హోమ్‌లో ఈ నెల 17 నుంచి 19 వరకు శ్రీ మిత్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జగదీష్ మెమోరియల్ జిల్లా స్థాయి షటిల్ టోర్నమెంట్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటివరకు 50 జట్లు పేర్లను నమోదు చేసుకున్నాయని టోర్నీ నిర్వహణ కమిటీ ప్రతినిధి పెదిరెడ్ల రాము తెలిపారు. సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. రోజూ సాయంత్రం 6 గంటల నుంచి పోటీలు ఉంటాయని, పేర్లు నమోదు చేసుకున్నవారికి కేటాయించిన తేదీల్లో గంట ముందుగా హాజరు కావాలని కోరారు. డబుల్స్ విభాగంలో నిర్వహిస్తున్న ఈ టోర్నీ సజావుగా జరగడానికి క్రీడాకారులు సహకరించాలన్నారు. కోర్టు సిద్ధం చేశామన్నారు.

నేడు ద్విచక్ర వాహనాల వేలం

పాతపట్నం: ఈ నెల 17న మండలంలోని ప్రహరాజపాలెంలోని స్పషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) ఆధ్వర్యంలో వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను వేలం వేయనున్నారు. ఈ మేరకు ఎస్ఈబీ సీఐ వై.లక్ష్మనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటలకు ఎస్ఈబీ స్టేషన్ వద్ద వేలం వేయనున్నట్లు చెప్పారు. ఉదయం 9 గంటలకు ఆధార్ జిరాక్సుతో పాటు రూ.1000 ముందస్తుగా చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

వైఎస్సార్ కంటి వెలుగు వరం

కొత్తూరు: మండల కేంద్రంలోని సత్యసాయి మందిరం అవరణలో గురువారం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. 64 మంది అవ్వాతాతలకు కంటి పరీక్షలు చేపట్టారు. 25 మందికి కంటి ఆపరేషన్లకు గుర్తించినట్లు ఆప్తాలమిక్ ఆఫీసర్ ఇప్పిలి జానకిరామయ్య తెలిపారు. వీరిని శ్రీకాకుళంలో రిమ్స్‌కు ప్రత్యేక వాహనం ద్వారా తీసుకువెళ్లినట్లు చెప్పారు. మండల సత్యసాయి సమితి ప్రతినిధి లోతుగెడ్డ భగవాన్ నాయుడు, టీటీడీ ఆధ్యాత్మిక మండలి మండల కమిటీ కన్వీనర్ పొగిరి రవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని రాపాక పంచాయతీ పరిధిలోని ఇల్లయ్యగారిపేట, వావిలపేట గ్రామాల్లో గురువారం వైఎస్సార్ కంటి వెలుగు మూడో విడతలో భాగంగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 40 మంది వృద్ధులకు ఆప్తాలమిక్ అధికారి డాక్టర్ అనసూయ కంటి పరీక్షలను నిర్వహించి మందులను పంపిణీ చేశారు.

ఉచిత ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రీటైల్ అసోసియేట్ కమ్ క్యాషియర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ పి.లత , జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీబీ సాయి శ్రీనివాస్ తెలిపారు. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. పదో తరగతి నుంచి పీజీ విద్యార్హత కలిగిన 18–30 ఏళ్ల లోపు వయసున్న స్త్రీలు, పురుషులు అర్హులన్నారు. కోర్సు పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్స్‌తోపాటు ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తామన్నారు. శిక్షణకు సంబంధించి మార్చి 20న స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నామన్నారు. సర్టిఫికెట్లు, ఆధార్ జిరాక్స్ తీసుకుని హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్‌ను 99499 00672 సంప్రదించాలన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



విద్యార్థులను పరీక్షిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ లక్ష్మీతులసి

మెళియాపుట్టి: పాఠశాల వాతావరణం పరిశుభ్రంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ లక్ష్మీతులసి అన్నారు. మండలంలోని పెద్దలక్ష్మీపురం బీసీ వసతిగృహాన్ని గురువారం సందర్శించారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉంచడంతోపాటు, పాఠశాల విద్యార్థులు కూడా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జ్వరం, దగ్గు, ఇతర లక్షణాలతో ఉన్న తొమ్మిది మంది విద్యార్థులకు మలేరియా, టయిఫాయిడ్, డెంగ్యూ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. సాధారణ జ్వరం ఉన్నట్లు గుర్తించారు. అనంతరం పాఠశాల పరిసరాలు, మధ్యాహ్న భోజనం తయారు చేసే ప్రదేశాన్ని పరిశీలించారు. డాక్టర్ హేమంత లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.